# మతబలి

రచయిత :
Dr. శ్రీ శథపతి

[ఛాందసవాదానికి, ఛాందస వాదోద్ధారకులైన అవధాన్లకు, బలిమై అష్టకష్టాలు పడుచున్న నా భారత సోదరసోదరీమణులకు యిదియె నా కన్నీటిధార.]

?

అది శీతకాలపురాత్రి. కార్తీకమాసపు కృష్ణపక్షరోజులవి. ధనవంతులు దివ్యభవనాల్లో శాలువలు కప్పుకొని ప్రియురాళ్లతో యిచ్ఛావిలాసాలు సాగిస్తుంటే, తేమనేలలో పండుకొని శిథిలమైన పూరిగుడిసెలోనుంచి మింటతారలను చూస్తూ, మరుచటిరోజు భుక్తి ఎట్లాగడుస్తుందో అని ఆలోచిస్తూన్న బీదజనానికి అదొక కాళరాత్రి. అప్పటికి 9½ గంటలయింది. ఆ గ్రామములో జనసంచలనము తగ్గిపోతూయుంది. ఛాందసవాదానికి పుట్టినిల్లగు ఆ ఊరిలో యింకా ఒకరిద్దరు అవధాన్లు చావడిలో కూర్చుని భాస్కరరామాయణం పారాయణచేయడం వినిపిస్తూనేయుంది. యింతలో—

"అమ్మో! అమ్మా! పుణ్యాత్ముల్లారా! ధర్మాత్ముల్లారా! నా తల్లుల్లారా! రెండు రోజులబట్టి తిండిలేదమ్మా! ప్రాణాలెగిరిపోతున్నాయ్. పట్టెడన్నం పెట్టించండి తల్లీ" అని అతిదీనమయిన కేక వీదంట వినిపించింది కొంతసేపటికి "ఎవరురా, అక్కడ, గుమ్మం దగ్గర నిలబడు, తెస్తున్నాను" అని ఒక స్త్రీ కంఠస్వరం.

అంతచీకటిరాత్రప్పుడు ఆకలిబాధతో ఆర్తనాథం కావించినవాడు మాలమారయ్య. తిండిలేక ఆకలిచే, జబ్బుచే బాధపడుచున్న యెంకిని అల్లరిచేస్తాడని అయిదేళ్ల కొడుకుని భుజంపై వేసుకొని, ఒకచేతిలో చినిగిపోయిన గుడ్డతో ఆ బాపనవీధిలో పెరటి గుమ్మం దగ్గర ఆగాడు నిర్భాగ్యహరిజనుడు. మరొక కొంతసేపటికి ఒక వృద్ధసువాసిని ఒక చేత్తో లాంతరు, మరొకచేత్తో అన్నం పట్టుకు వచ్చింది. ఎంతోఆశతో ఆ కుర్రాడు ఆ చింపిగుడ్డను ముందుకుపెట్టాడు. ఆ వృద్ధ బ్రాహ్మణసువాసిని అన్నంపడేస్తూ "మీ యిల్లెక్కడ" అని అడిగింది. "యీ నూక్కాలు పక్కన వీధిచివరనమ్మా" అన్నాడు.

అయితే! నువ్వా ఓరీ మాలవెధవా! నీపిండం పీడాకులుగాను, యీ బ్రాహ్మణ వీధిలోకి ఏలాగువచ్చేవురా? చండాలుడా! నీ మొగంకాలా! అంటూ తననోటికొచ్చినట్టు తిట్టూఉంది. ఇంతలో చావడిలో రామాయణం చదువుతూన్న సూర్యనారాయణవధాన్లు వెకవనున్న చేపాటికర్రను పట్టుకొని గబగబావచ్చి "ఓరీ మాలవెధవా! నీకేం పోగాలంరా! వీధంతా మైలచేసావు" అంటూ పట్టెడన్నంకోసం అశపడుతూ, చేత్తోతీసి తినబోతూన్న ఆ పసిపిల్లాడి తలమీద "దబీదబీ" మని నాలుగు దెబ్బలు కొట్టి, అన్నంతోవున్న ఆచింకిగుడ్డను మురికికాల్వలోనికి తన్నేసాడు. ఆకలికితోడు దెబ్బలతో ఏడుస్తూయున్న కుమారుని ఎత్తుకుని యింటివైపు నిరాసతో నడిచాడు మారయ్య.

మర్నాడు కార్తీక సోమవారం. ఆ గ్రామంలోవున్న శివాలయంలోనికి చుట్టు

ప్రక్కలనున్న పల్లెటి గ్రామాలవారంతా రావడంతో అదొక పెద్ద యాత్రసాగింది. ఆ యాత్రప్రజలతోపాటు ముష్టివాళ్ల బారు ఆలయంచుట్టూ అలంకరించింది. వాళ్ళతోపాటు మారయ్య కూడా తన యిరువురి పిల్లలతో ఆలయానికి ఒక పదిగజాల దూరంలో నిల్చున్నాడు. ఆలయానికి వెళ్లేవారంతా మోక్షంకోసం దేవుడికి మ్రొక్కుతూయుంటే ......ప్రస్తుతో కృశించిన పెళ్లాం బిడ్డలతో నాల్గురోజులు గంజినీళ్లయినా తాగడానికి వస్తుందా? అని దేవుడికి నిమాలితలోచనుడై దీర్ఘంగా మొక్కుతున్నాడు మారయ్య. ఆ ముష్టిగుంపులో వర్ణవిచక్షణలేక హిందూ మహమ్మదీయ సమ్మేళనం అయివుంది. కాని మారయ్యమాత్రం భయపడుతునే కొసను నిల్చున్నాడు. ఇంతలోకి ఒక సనాతన బ్రాహ్మణగుంపు ఆలయంలోకి ప్రవేశించింది. "బాబుల్లారా! బీదోణ్ణి ఒక్క రాగిపైసా పడేయండి బాబో!" అని ఆకలిబాధచే అలమటించుచున్న కంఠంతో నీరసంగా అన్నాడు. ఆమాటలు వినీవినడంతో ఆ దేవాలయపు పూజారి రామలింగావధాన్లు మారయ్యవైపు తిరిగి, గ్రుడ్లెర్రచేసుకొని "మాదిగవెధవా! దేవుడ్ని మైలపరుస్తూన్నావేమిరా? నీకేం పోగాలంరా? ఊ...కదలు, యింకా చూస్తున్నావ్ మంటిబుక్కడంలాగు".

"పిల్లవాడు ఏడుస్తున్నాడు- చిన్న అరటిపండు యివ్వండిబాబూ వెలిపోతాను".

"ఏం! మీ అమ్మమొగుడు యిక్కడ అరటిపండ్లు కొనిచ్చాడా ఏమిటి- యిక్కడ నీలాంటి వారికి ఒత్తినే యివ్యాడానికి? "పో. కానిచ్చికొనుక్కుంటే రెండిస్తారు".

"డబ్బులేదు బాబయ్యా, బీదోణ్ణి. మీ పాదాలకి నమస్కరిస్తాను. చిన్న అరటిపండు పడేయండి బాబయ్యా- వెళ్లిపోతాను".

"అరే! దొంగవెధవా! యింకా మాట్లాడుతున్నావ్. ఊ. వెళ్తావా? వెళ్ళవా?" అంటూ ఒక కొబ్బరిబొండాంతో విసరి కొట్టాడు. పాపం! ఆబొండాం మారయ్య నుదుటికి తగిలి రక్తం కారనారంభించింది. ఆ ప్రక్కనే యిదంతా చూస్తూన్న ఒక స్కౌటు అబ్బాయి మారయ్య నుదుటిరక్తం కారడం చూచి, తన యింటికి తీసుకునిపోయి రక్తం రాకుండా కట్టుగట్టి, మారయ్యచేతిలో 2 అణాలు పెట్టి, పో, పాపం, పిల్లాడు ఏడుస్తున్నాడు. ఏదైనా కొనియ్యి అనిచెప్పి వెళ్లిపోయాడు.

అసలు జబ్బుతో కృశిస్తోంది ఎంకి. సగంతాటాకులు ఎగిరిపోయిన ఊరవతల పాకలో, తేమనేలపై యీతచాపలో పడుకుని తన బిడ్డలకైనా పట్టెడన్నం దొరికిందా అని ఆలోచిస్తూంది. ఎంకికి దీర్ఘజబ్బుతోపాటు మనోవ్యాధి కూడా పీడిస్తూంది. తిండికేలేక కష్టమైపోతూంటే మారయ్య మందెక్కడ యిప్పించగలడు? అక్కడకీ ఆ ఊరి వైద్యులు జగ్గన్నను అడిగితే నాల్గురూపాయలడిగాడు, దాంతో నిగాస చేసుకొన్నాడు. కాని ఎంకికి మాత్రం జబ్బు ముదిరిపోయి ప్రాణంమీదికి వచ్చింది. రాత్రి ఎనిమిదిగంటలకల్లా, యిందాకటి స్కౌటు అబ్బాయి యిచ్చిన రెండణాలు పట్టుకొని, పిల్లలతో తన జీర్ణకుటీరం ప్రవేశించాడు మారయ్య. పిల్లలు కునికిపాట్లుపడుతున్నారు.

''నీవంట్లో యెలావుంది!'' అని అడిగాడు యెంకిని. ''పిల్లలకేమైనా దొరికిందా!'' అని గంపెడాశతో అడిగింది మారయ్యని. ''రెండణాలు దొరికినై. రేపు గంజికాచుకోవచ్చు'' నన్నాడు. యెంకి మారయ్యవైపు చూసి (ఆశ్చర్యంతో) "అదేంటి బావా? నుదుటిమీద గుడ్డ కట్టుకున్నావ్.''

"ఏమిలే?"

(అంతలో కుఱ్ఱాడులేచి) ఏడుస్తూ, ఊ ...ఊ అయ్యా...కొత్తా.

(ఆతృతతో) "ఎవరికి కొట్టేసావ్? బావా."

పిల్లాడు మరీరెట్టింపుతో ఏడుస్తూ, రక్తంతో మరకకట్టియున్న మారయ్యపై మీదవున్న గుడ్డతీసిచూపి "అయ్యా... కాయ...కొత్తారి".

యెంకి ఆతృతతో మారయ్య నుదుటిమీద కట్టువిప్పి చూచి (ఏడుస్తూ) "ఎవరు కొట్టారు బావా? వాడిచేతులుకాలా, వాడికి కుష్టురోగం తగలా, వాడిపెండ్లాం ముం ... వాళ్లకేం తిట్టామా, కొట్టామా? మనమేదో అడుక్కుంటూ దొరికినరోజున తింటూ, లేనిరోజున పస్తుంటూయుంటే మనన్లేకొట్టాలా."

"యెంకీ తిట్టకు. వాళ్లు అగ్రజాతులు. వాళ్లేంచేసినా మనం కాయల్సిందే. మన నుదుటిలో ఎన్నాళ్లిట్లా తిరగాలని బ్రహ్మ రాసాడో అన్నాళ్లు తిరగక మనవశమా? ఒకర్నితిట్టి లాభమేమి? ఊరుకో తప్పు" అని చెదరిపోయిన ఆమె ముంగురులు సవరిస్తూ అన్నాడు.

అప్పటికి రాత్రి 3½, 4 గంటలయియుంటుంది. యెంకిలేచి, బావా దాహం కొం చెమునీళ్లు అనిమూలుగుతూఅంది. "ఇప్పుడే తెచ్చిస్తాను" అని మారయ్య లేచి మూలనున్న దాకతో చెరువుకు పరుగెత్తాడు. పరుగెత్తడంలో ఆగట్టుమీదనున్న ఎండుటాకుల చప్పుడు వినవయింది. వెంటనే అవతల గట్టుమీద కూచుని శివస్తోత్రంచేస్తూన్న రామలింగావధాన్లు, సూర్యనారాయణావధాన్లు గార్లకు వినిపించింది. ''ఎవడురా అవతలగట్టుమీద?'' అని యిద్దరూ ఐక్యకంఠంతో గర్జించారు. ''నేనుబాబూ మారయ్యని, జబ్బుతోవున్న మా ఆడదానికి దాహంకోసం నీళ్లు పట్టుకెళ్లుతున్నాను బాబూ'' అని అన్నాడు మారయ్య.

''ఓరీ మాలవెధవా! ఎక్కడచూసినా నీవేనట్రా? చెరువుగట్టుమీదకు రమ్మని నీకెవడధికారం ఇచ్చాడ్రా? పో. ఊరవతల నూతికి'' అని గదమాయించారు. మారయ్య మారుమాటాడకుండా అక్కడకు మైలు దూరంలోవున్న నూతికి బయలుదేరాడు. అటనుండి నీళ్లుతెచ్చి యెంకిని పలకరించేసరికి, యెంకి యీలోకంవిడిచి కొయ్యబారివుంది. పిల్లలంతా గొల్లుమన్నారు, మారయ్య కూలబడ్డాడు.

ఈ దృశ్యం చూడలేకగాబోలు, అంతవరకూ మింటనున్న చుక్కలు ఒక్కసారి అదృశ్యమైనవి.

యీ పవిత్ర భారతదేశంలోనుంచి, బీదజనుల పొట్టబెట్టే యీ కరుకుఛాందస వాదం ఎప్పుడు పోతుందోకదా!